క్లుప్తంగా...

ఘనంగా కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ వార్డులో హైదర్షాకోట్ లక్ష్మీనగర్ కాలనీలోని కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్పొరేటర్ పుష్పశ్రీనివాస్‌రెడ్డి పూజలు నిర్వహించారు.

మణికొండలో భగీరథ శోభాయాత్ర



యాత్రలో పాల్గొన్న సగర సంఘం సభ్యులు

మణికొండ: సగరుల ఆరాధ్య దైవం భగీరథ జయంతిని పురస్కరించుకుని గురువారం మణికొండ సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ శోభాయాత్ర బైక్ ర్యాలీని నిర్వహించారు. మణికొండ నుంచి నగరంలోని రవీంద్రభారతి వరకు ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో మణికొండ సగర సంఘం నాయకులు, సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ బస్సు ఢీ కొని మహిళ మృతి

శంషాబాద్: ఆర్టీసీ బస్సు ఢీ కొని మహిళ మృతి చెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అవంచ గ్రామానికి చెందిన జహంగీర్‌బీ(45) తన కుమారుడితో కలిసి పట్టణంలోని ఎయిర్‌పోర్టు కాలనీలో నివాసముంటు కూలీ పనులు చేసుకుంటుంది. గురువారం ఉదయం ఆర్‌జీఐఏ ఏపీఎస్ ఎదురుగా ఉన్న మార్కెట్ నుంచి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న ఏపీఎస్‌ఆర్‌టీసీకి చెందిన బస్సు వేగంగా ఢీ కొంది. దీంతో తలకు తీవ్రగాయాలై మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ భవనం



హైదరాబాద్ నాలెడ్జిసిటీలోని టీవర్క్స్ భవనం ఇదే

అద్దాల మేడలు.. అందమైన రోడ్లు

వావ్ నాలెడ్జి సిటీ



హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని రోడ్లు, అద్దాల మేడల భవనాలు

రాయదుర్గం: నాడు భారీ బండరాళ్లు.. మట్టితో కూడిన గుట్టలు, ఎత్తుపల్లాలున్న ప్రాంతం. ఇప్పుడు అద్దాల మేడలు, అందమైన రోడ్లకు నిలయమై 'హైదరాబాద్ నాలెడ్జి సిటీ'గా మారింది. నెమళ్లు, ఇతర పక్షులకు స్థావరంగా కొనసాగిన ఈ ప్రాంతం చుట్టూరా ఐటీ, ఇతర సంస్థలు నెలకొనడంతో రూపురేఖలు మారిపోయాయి. మొదటగా బయోడైవర్సిటీ పార్కును 15 ఎకరాల్లో ఏర్పాటు చేసి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత ఫ్లైఓవర్లు, మెట్రో సౌకర్యం, వంతెన నిర్మాణం, రోడ్ల విస్తరణతో దశ తిరిగిపోయింది. టీహబ్, టీవర్క్స్, ఇతర బహుళ అంతస్తుల అద్దాల మేడలతో కళకళలాడుతోంది.

మౌలిక వసతులు కల్పించిన టీఎస్ఐఐసీ

- రాయదుర్గంలోని సర్వేనంబరు 83లో భూమిని ప్రభుత్వం, టీఎస్ఐఐసీ కలిసి 'హైదరాబాద్ నాలెడ్జిసిటీ'గా నామకరణం చేసింది.
- ఆ తర్వాత పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టారు. రూ.73 కోట్ల వ్యయంతో రోడ్ల విస్తరణ, వైట్‌టాపింగ్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ ఏర్పాటు చేస్తున్నారు.
- ఈ భూమిలోనే ని భారీ గుట్టపై నుంచి పాత ముంబయి రోడ్డును కలుపుతూ రూ.18 కోట్ల వ్యయంతో కొత్త రోడ్డు, రూ.275 కోట్ల వ్యయంతో హైదరాబాద్ నాలెడ్జి సిటీ కూడలిలో ఫ్లైఓవర్ నిర్మించారు.
- దుర్గంచెరువుపై ఆకట్టుకునే తరహాలో వంతెన నిర్మాణం చేసి హైదరాబాద్ నగరానికే మరో హైలెట్‌గా నిలిచేలా చేశారు.
- హైదరాబాద్ నాలెడ్జిసిటీకి చేరువలో మెట్రో స్టేషన్ నిర్మాణంతో రాకపోకలు సులువయ్యాయి.
- దేశంలోనే అతిపెద్ద ఇంక్యుబేషన్ సెంటర్‌గా టీహబ్ ఫేజ్–2, టీవర్క్స్ నిర్మాణంతో ఇక్కడి పరిస్థితులు వేగంగా మారిపోయాయి.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

రాజేంద్రనగర్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ వెల్లడించారు. కృష్ణానగర్ కాలనీలో రూ. 8 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి రోజూ డివిజన్ పరిధిలోని బస్తీలు, కాలనీలలో విస్తృతంగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామన్నారు. డివిజన్ ప్రజల అభివృద్ధి కోసం ఎన్ని కష్టాలైన ఎదుర్కొంటు అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల సమస్యలే తమకు ముఖ్యమని ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బీట్యాకరి సిద్దేశ్వర్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ వీరారెడ్డి, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయాన్ని పరిరక్షించండి

మణికొండ: ఎల్లమ్మ దేవాలయానికి దారి లేకుండా కొందరు కబ్జాకు పాల్పడుతున్నారని, దాన్ని పరిరక్షించాలని మణికొండ గ్రామస్తులు కోరుతున్నారు. మున్సిపాలిటీ కేంద్రంలోకి ల్యాంకోహిల్స్ ఎదుట ఉన్న ఎల్లమ్మ చెరువు వద్ద పూర్వం నుంచి ఎల్లమ్మ దేవాలయం ఉందని గ్రామస్తులు తెలిపారు. పక్క భూమి వారు ఏకంగా దేవాలయాన్ని కలిపి లేఅవుట్ చేసి ప్లాట్లను గతంలో విక్రయించారు. గతంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ప్రస్తుతం దేవాలయానికి దారి లేకుండా ప్రహరీలు నిర్మాణం చేపడుతుండటంతో గురువారం గ్రామస్తులు అడ్డుకున్నారు. గతంలో ల్యాంకోహిల్స్ నిర్మాణ సమయంలో వారు ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన భూమిలో రెండు గుంటల భూమిని దేవాలయానికి వదలారని, సదరు స్థలాన్ని రెవెన్యూ అధికారులు ప్రస్తుతం చూపాలని వారు కోరారు. ఇదే విషయంలో తహసీల్దార్‌ను కలిసి సర్వే చేసి రెండు గుంటల భూమిని చూపాలని కోరతామని గ్రామస్థులు తెలిపారు.

ఓటరు జాబితాను సవరించాలని బీజేపీ వినతి



వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ నేతలు

శంషాబాద్: ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సవరించాలని బీజేపీ నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బూత్ నంబర్ 464 నుంచి 496 వరకు ఉన్న ఓటరు జాబితా పూర్తిగా అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఇంటి నంబర్ల ఆధారంగా ఓటరు జాబితాను తయారు చేయడంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఒకే ఇంటిలో ఉన్న ఓటర్లు వేర్వేరు బూత్‌లతో ఓటు వేసేలా ఉన్నాయన్నారు. దీంతో ప్రతి ఎన్నికలప్పుడు ప్రజలు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్‌గుప్తా, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని దేశంలోనే ఎక్కడా లేని విధంగా పలు సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మణికొండ మున్సిపాలిటీ చిత్రపురి కాలనీకి చెందిన డి. అన్నపూర్ణకు రూ. లక్ష ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ వ్యాప్తంగా ఇలాంటి పేదలు అనారోగ్యంతో ఆస్పత్రుల పాలైతే సంబంధిత బిల్లులతో తనను సంప్రదిస్తే వారిని రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీబాత్‌పై కథనాల విడుదల



కథనాలు విడుదల చేస్తున్న అధికారులు

ఏజీ వర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) రైతు సంక్షేమంపై మన్‌కీబాత్‌పై రెండు పరిశోధనాత్మక కథనాలను గురువారం విడుదల చేశారు. ఇందులో సేంద్రీయ సహజ వ్యవసాయం, అగ్రి స్టార్టప్, రైతులు, వినియోగదారుల మధ్య సేంద్రియ సహజ వ్యవసాయంపై కథనాలు విడుదల చేశారు. కార్యక్రమంలో మేనేజ్ అధికారులు పేర్కొన్నారు.

మైసమ్మ కుంటను అభివృద్ధి చేస్తాం

మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



క్రీడా ప్రాంగణ పనులను పరిశీలిస్తున్న వైస్ చైర్మన్, కమిషనర్

మణికొండ: ల్యాంకోహిల్స్ సమీపంలో మూడు ఎకరాల స్థలంలో ఉన్న మైసమ్మ కుంటను సుందరంగా తీర్చి దిద్దేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం వారు డీఈ దివ్యజ్యోతితో కలిసి మణికొండ క్రీడాప్రాంగణం, శ్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం గతంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మైసమ్మ కుంట ల్యాంకోహిల్స్ నిర్మాణ సమయంలో మట్టి పోసి పూడ్చారని, తిరిగి దాన్ని యథాస్థితికి తెచ్చి ఇస్తామని అప్పట్లో వారు రాత పూర్వకంగా తెలిపినా అమలుకు నోచుకోలేదన్నారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పునరుద్ధరణ పనులను చేపడతామన్నారు. అందులో రాబోయే రోజుల్లో బోటింగ్ ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. శ్మశానవాటిక, క్రీడా ప్రాంగణం పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు బీరప్ప, రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయి సంస్థాన్ వార్షికోత్సవం



దత్త హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని సాయి సంస్థాన్ 16వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు మేలు కొలుపు హారతి సేవతో ప్రారంభమైన పూజలు అనంతరం క్షీరాభిషేకం, అభిషేక సేవ, శ్రీసాయి, గణపతి, శ్రీ దత్త హోమాలు నిర్వహించారు. ఉదయం 10 నుంచి స్థానిక కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక కిరణ్‌కుమార్ ఏర్పాటు చేసిన శ్రీ సాయి భక్తిగీతాలాపన (అర్కెస్ట్రా) వారు పాడిన పాడలతో భక్తులు మైమరచి పోయారు. మధ్యాహ్నం ఒంటి గంటకు హారతి, విజయలక్ష్మి, కరుణకుమార్ దంపతులు ఏర్పాటు చేసిన అన్నదానంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 6.30 సంధ్యాహారతి, పల్లకీ సేవ, రాత్రి 8.30 గంటలకు శేజారతి, పవళింపు సేవ, తీర్థ ప్రసాద వితరణలతో పూజలు ముగిశాయి. సాయి సంస్థాన్ అధ్యక్షుడు కె.వినోద్‌కుమార్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ మాజీ ఎంపీటీసీ సాయిరాం, నాయకులు రాము, వేణుగౌడ్, కిరణ్‌కుమార్, రాంబాబు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా

మణికొండ: బీఆర్ఎస్ పార్టీలో ఉద్యమ సమయం నుంచి పనిచేసినా సరైన గుర్తింపు లేదని పేర్కొంటు ఆ పార్టీకి చెందిన పట్టినాగులపల్లి వార్డు నాయకుడు ఎం.ప్రదీప్ కుమార్ రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రతి సమావేశానికి వందల మందితో వెళ్లినా మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహా, స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ గుర్తించలేదన్నారు. గతంలో వార్డు సభ్యుడిగా పనిచేసి గత మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓటమి చెందానన్నారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా ఇక ముందు పోరాటం చేస్తానని తనతో పాటు సుమారు మూడొందల మంది పార్టీ సభ్యులు రాజీనామా చేస్తున్నారని ఆయన ప్రకటించారు.

కూలీలకు కిచిడీ ప్యాకెట్ల పంపిణీ



మణికొండ: రోజువారీ కూలీ పనులు చేసుకున్న వారికి వీఆర్ ఫర్ యు వయోజన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు గురువారం మణికొండ క్వార్టర్స్ లేబర్ అడ్డా వద్ద కిచిడీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు బి.బాపూజీ, ప్రధాన కార్యదర్శి డి.సీతారాందాస్ మాట్లాడుతూ... పేదలు, విద్యార్థులకు తమ సంస్థ తరపున చేతనైన సహాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి దిలీప్ కక్కడ్, సభ్యులు అందె లక్ష్మణ్ రావు, సాంబశివరావు, నాగేంద్రరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో సందడిగా 'నిర్వాణ'



రోబో టెక్నాలజీపై ప్రదర్శనను తిలకిస్తున్న చైర్మన్, ప్రిన్సిపాల్

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల వార్షికోత్సవ సందడి నిర్వాణ–2023 గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యింది. కళాశాల ప్రాంగణంలో చైర్మన్ డి.ప్రవీణ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యార్థులు నేర్చుకున్న ఇన్నోవేషన్‌లతో పాటు రాణించిన రంగాలను ఈ వేడుకల్లో ప్రదర్శిస్తారన్నారు. ఉత్సవాలలో మొదటి రోజు నిర్వహించిన టెక్నికల్ ఫెస్ట్‌ను ఆయన పరిశీలించారు. క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, సింపోజియంలు నిర్వహించారు. కళాశాలకు చెందిన 8 విభాగాల్లో 4 వేల మంది విద్యార్థులు ఉత్సవాల్లో పాల్గొంటున్నారని ఆయన వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, నిర్వాణ చైర్మన్ పి.రాంకిషోర్ కుమార్ రెడ్డి, పలు విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

బండ్లగూడ: ప్రజలు తమ ఆరోగ్యాలపై శ్రద్ధ వహిస్తూ తగు జాగ్రత్తలు పాటించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో డాక్టర్ మహ్మదీయ భాను ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ... మనిషికి గుండెపోటు వచ్చినప్పుడు ఏ విధంగా చికిత్స ప్రక్రియ చేయాలో క్లుప్తంగా వివరించడం జరిగిందన్నారు. అనంతరం అంబులెన్స్‌ను అందులో ఉన్న అత్యవసర మందులు, ఆక్సిజన్ సిలిండర్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్ చంద్రశేఖర్, హెల్త్ అధికారులు రవి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మేయర్ మహేందర్‌గౌడ్

ఉచ్ఛ్వాస్ ట్రాన్సిషనల్ కేర్‌కు ప్రతిష్టాత్మక క్వాలిటీ అవార్డ్



గచ్చిబౌలి: క్వాలిటీ అండ్ అక్రిడిటేషన్ ఇనిస్టిట్యూట్ (క్యూఏఐ) ప్రముఖ ఉచ్ఛ్వాస్ ట్రాన్సిషనల్ కేర్‌కు క్వాలిటీ కేర్ అవార్డును అందజేసింది. ట్రాన్సిషనల్ కేర్ రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో సేవలందించినందుకు ఈ అవార్డు అందజేశారు. ఆస్పత్రుల నుంచి డిశ్చార్జి అయిన పేషెంట్లకు గచ్చిబౌలిలో ఉచ్ఛ్వాస్ కేర్‌లో అవసరమైన సంరక్షణ అందిస్తోంది. ఉచ్ఛ్వాస్ కేర్ చైర్మన్ డాక్టర్ రాంపారావు మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా రోగి సంరక్షణ ప్రమాణాలు, సేవలస్థాయిని పెంచుతూ సేవలందిస్తున్నామని తెలిపారు. ఫిజియోథెరపిస్టులు, ఫిజీషియన్లు, నర్సులు, న్యూట్రీషియన్లు, ఆపరేషన్ బృందాల సేవలను ఆయన అభినందించారు. రిహాబిలిటేటివ్ రంగంలో సరికొత్త మార్పులను తీసుకొచ్చామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పించండి: బీజేపీ



అధికారులకు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అలాగే ప్రభుత్వ పాఠశాలల స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.బాబురావు ఆధ్వర్యంలో బుద్వేల్ భగవతీగూడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. పాఠశాలకు సంబంధించి దాతలు 350 చదరపు గజాల స్థలాన్ని పాఠశాలకు ఉచితంగా అందించారన్నారు. ఇప్పుడు కనీసం పాఠశాలకు వెళ్లే దారి కూడా సరిగా లేదన్నారు. పాఠశాలకు సంబంధించిన స్థలం మొత్తం అక్రమణకు గురైందని తెలిపారు. కొలవగా 177 గజాలు స్థలం ప్రభుత్వానికి ఉంది అన్ని వైపులా అక్రమణలు జరిగాయన్నారు. కొందరైతే ఏకంగా పాఠశాల భవంతి పైననే వారి ఇంటి నిర్మాణాన్ని నిర్మించారన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. పాఠశాలకు ఇంత వరకు తాగునీటి సదుపాయం లేదని డ్రైనేజి సదుపాయం లేదని, మధ్యాహ్న భోజన పథకం కింద వచ్చే భోజనాన్ని వేడి చేసే వంట పాత్రలలో వేసుకొని నడుచుకుంటూ తీసుకెళ్తున్నారన్నారు. ఇవన్నీ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణ ముదిరాజ్, యువ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి బొక్క బాల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు మూల శ్రీనివాస్‌గౌడ్, పి.సందీప్‌కుమార్‌ముదిరాజ్, చేవెళ్ల పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ సోల్కర్‌రెడ్డి, రాజ్ కుమార్, సురేందర్, రాపర్తి రాకేష్, క్షేత్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

తీపి గుర్తులను అందించేది ఫొటోగ్రాఫర్‌లే..



ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న నరేందర్‌రెడ్డి తదితరులు

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని అడ్రస్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన గురువారం ఫొటోఫినా 20 ఎగ్జిబిషన్‌ను మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరికీ ఎన్నో తీపి గుర్తులను అందించేది ఫొటోగ్రాఫర్‌లే అన్నారు. మనిషి సజీవంగా లేకపోయినా వారితో ఉన్న.. గడిపిన రోజులు, ఫొటోలు, వీడియోలతో పదిలంగా దాచుకోవచ్చన్నారు. ఫొటోగ్రాఫర్‌ల రంగంలో వస్తున్న మార్పులు, టెక్నాలజీలను తెలుసుకునే నిమిత్తం ఇలాంటి ఎగ్జిబిషన్‌లు ఎంతో తోడ్పడతాయన్నారు. మరో రెండు రోజుల పాటు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని, ఫొటో గ్రాఫర్‌లు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. బీజేపీ నాయకులు సి.బీరప్ప, బి.రవికాంత్‌రెడ్డి, మణికొండ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. రాజు, ఉపాధ్యక్షుడు విజయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.